క్లుప్తంగా

బొగుడగూడంలో నీటి సమస్య పరిష్కారం


ట్యాప్ ద్వారా నీటిని అందజేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

వేమనపల్లి: బొగుడగూడంలో తాగునీటి ఇబ్బందులపై పడుతున్న ఇబ్బందులపై 'ఖాళీ బిందెలతో నిరసన' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బంది స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఆదేశాలతో కార్యదర్శి శ్యాంచంద్, కారోబార్ ఎట్యార్, వాటర్‌మెన్ రవి ఆ కాలనీకి వెళ్లారు. ట్యాంకులో నీరు లేని కారణంగా ఇటీవల కాలనీకి నీరు రాలేదని, అక్కడే ఉండి నీటిని ట్యాంకులోకి ఎక్కించారు. బొగుడగూడం కాలనీలో ఇంటింటికీ నీరు అందించేలా చర్యలు చేపట్టారు.

జనతాదళ్ (ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్


సుదర్శన్

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన వెల్ది సుదర్శన్‌ను జనతాదళ్ (ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి గట్టు బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు సీకే నాను, ప్రధాన కార్యదర్శి గట్టు బాబు నాయకులకు సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికులకు రక్ష కాటమయ్య కిట్లు


శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు, ఎక్సైజ్ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాటమయ్య రక్షణ కిట్లతో గీతకార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చునని మంచిర్యాల ఎక్సైజ్ సీఐ జి.గురువయ్య తెలిపారు. మండలంలోని వేంపల్లి శివారు తాటిచెట్ల వనంలో శుక్రవారం మంచిర్యాల, లక్సెట్టిపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య సురక్షా కవచం రక్షణ కిట్లపై గీత కార్మికులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ జిల్లా ఎక్సైజ్ అధికారి నందగోపాల్ ఆధ్వర్యంలో ట్రైనర్ల ద్వారా గీత కార్మికులకు తగిన మెలకువలతో శిక్షణ పూర్తి చేస్తామన్నారు. బీసీ సంక్షేమాధికారి వినోద్, మంచిర్యాల ఎక్సైజ్ ఎస్సై మనీ షారాథోడ్, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లోని గీత కార్మికులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషిచేయాలి'

దండేపల్లి: బీజేపీకి రోజురోజుకు ఆదరణ లభిస్తోందని, కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. మండలంలోని గూడెం, వెల్లనూర్ గ్రామాల్లో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న పార్టీ సభ్యత్వానికి ప్రజలు స్వచ్ఛంద ముందుకు వస్తున్నారని చెప్పారు. బీజేపీ సభ్యత్వం కోసం 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. మండల అధ్యక్షుడు రాజయ్య, ఇన్‌చార్జి ప్రభాకర్, నాయకులు కిషన్, రవిగౌడ్, సురేందర్, శ్రీనివాస్, హరికృష్ణ, తులసి, సత్యం, యేసయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

వందేభారత్ రైలుకు హోల్టింగ్ ఇవ్వాలి

పాతమంచిర్యాల:నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ రైలుకు మంచిర్యాల స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు రైల్వే అధికారులకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. మంచిర్యాల స్టేషన్‌లో హాల్టింగ్ కల్పిస్తే సింగరేణి అధికారులు, వ్యాపారులు, మంచిర్యాల చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మేకల రామన్న, మల్లన్న, జ్యోతి, అరుణ, సురేందర్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బంద్ విజయవంతం చేయండి

భీమారం/కాసిపేట: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి నిరసనగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రాష్ట్రబంద్‌ను విజయంతం చేయాలని ఆదివాసీ నాయకపోడ్ సేవాసంఘం జిల్లా కార్యదర్శి తైనేని మహేశ్ కోరారు. భీమారంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ బంద్‌కు వ్యాపారులు, దుకాణ యజమానులు సహకరించాలని కోరారు. రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కాసిపేటలో ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు వెంకటేశ్ ప్రకటనలో కోరారు.

చెరువుకు రక్షణ కరువు

- హద్దురాళ్లు లేకనే శిఖం భూములు, కుంటలు కబ్జా
- అక్రమార్కులు పూడ్చివేతతో కోల్పోతున్న విస్తీర్ణం


ఇటిక్యాల చెరువుప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్ (ఫైల్)


వివాదాస్పదంగా ఉన్న ఇటిక్యాల చెరువు

లక్సెట్టిపేట: ఏళ్లుగా సాగునీరందించిన చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. హద్దురాళ్ల లేకపోవడంతో చెరువు, కుంటల భూములను అక్రమార్కులు కబ్జా చేస్తుండడంతో వీటి విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వం ముందుచూపు లేకనే శిఖం భూములకు రక్షణ కరువైంది. నిజాం కాలంలో బీడుభూములు సాగుచేసుకునేందుకు చెరువులు తవ్వించారు. వర్షపు నీటి ద్వారా ఆయకట్టు భూములకు ఖరీఫ్, రబీ పంటలకు నీరందేది. ప్రస్తుతం అక్రమార్కులు చెరువులు పూడ్చివేస్తుండడంతో విస్తీర్ణం కోల్పోతోంది. తూములు ఎత్తు తగ్గి మత్తడి పారక లేక ఆదరణ కోల్పోతున్నాయి.

విస్తీర్ణం తగ్గుతున్న చెరువులు

మండలంలో మొత్తం 12 చెరువులు, 25 కుంటలు ఉన్నాయి. కొమ్ముగూడెం, ఇటిక్యాల, హన్మంతుపల్లి, గంపలపల్లి, జెండావెంకటాపూర్, వెంకట్రావుపేట గ్రామాల్లో మేజర్ చెరువులు ఉన్నాయి. ఏళ్లుగా చెరువులు ఆయకట్టు పొలాలకు నీరందిస్తూ మత్స్యకారులు జీవనోపాధిని పొందేవారు. 451 సర్వే నంబర్‌లో కొమ్ముగూడెం చెరువు 253.08 ఎకరాలు, 333 సర్వే నంబర్‌లో ఇటిక్యాల ఊర చెరువు 41.30 ఎకరాలు, సర్వే నంబర్ 84లో ఊత్కూరు పంచాయతీ పరిధి గంపలపల్లి చెరువు 94.09 ఎకరాల శిఖం భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులో నమోదై ఉంది. రానురాను కబ్జాకు గురవుతూ విస్తీర్ణం తగ్గుతుందని ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్, తహసీల్దార్ ఫిర్యాదు చేస్తున్నారు. ఇటిక్యాల చెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని, కొమ్ముగూడెం చెరువు భూమిలో చొరబడ్డారని, గంపలపల్లి చెరువులో మట్టిని తరలిస్తూ, కందకాలు తవ్వుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శిఖం భూములపై సర్వే నిర్వహించి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి



మత్స్యకారులకు చెరువులే జీవనాధారం. చెరువుల భూములను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. అధికారులు సర్వే చేసి చెరువులకు హద్దురాళ్ల ఏర్పాటు చేయాలి.

– మేడి నారాయణ, మత్స్యకారుడు, లక్సెట్టిపేట

చర్యలు తీసుకుంటాం

కొన్ని చెరువు భూములపై సర్వే నిర్వహిస్తున్నాం. పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి చెరువు శిఖం భూములను కాపాడుతాం. ఇటిక్యాల చెరువుకు త్వరలో హద్దులు ఏర్పాటు చేస్తాం. శిఖం భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గౌతమ్, ఇరిగేషన్ ఏఈ, మంచిర్యాల

ఇటిక్యాల చెరువు పరిశీలన

ఈనెల 13న కలెక్టర్ కుమార్ దీపక్.. ఇటిక్యాల చెరువును పరిశీలించారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని, సమీప బొట్లకుంట విస్తీర్ణం ప్రకారం కొలతలు వేయాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కొందరు రియల్ వ్యాపారులు చెరువు భూములను కొనుగోలు చేసి ప్లాట్లుగా చేసి మట్టిని తరలించారని ఆరోపణలున్నాయి. ఇటిక్యాల చెరువు కబ్జాకు గురైందని పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. హైడ్రా తరహాలో మండలంలో చెరువులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ జీవో విడుదలపై హర్షం


ర్యాలీ నిర్వహిస్తున్న గల్ఫ్ కార్మికులు

జన్నారం: 2023 డిసెంబర్ నుంచి గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంగడిబజార్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు గల్ఫ్ కార్మికులు మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి ఏర్పాటు, పిల్లల చదువుకు గురుకులాల్లో ప్రాధాన్యత ఇవ్వడం హర్షనీయమన్నారు. తెలంగాణ ఏర్పాటు నుంచి ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని కోరారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, గౌరవ అధ్యక్షుడు సేపూరి గోపాల్, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తిరుపతి, ఎల్లయ్య, సుదర్శన్, మల్లికార్జున్, హసన్, గంగాధర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, ముజ్జు, శాకీర్, లచ్చన్న, అంజన్న, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

రిటైర్ట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించండి

మందమర్రిరూరల్: సింగరేణిలో రిటైర్డ్ ఉద్యోగులకు రావల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనంతరం సంస్థ నుంచి వచ్చే పింఛన్ సరిపోవడం లేదన్నారు. వయస్సు పైబడడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఇప్పటికైన యాజమాన్యం వెంటనే స్పందించి గ్రాట్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలని, కొత్త పెన్షన్ అమలు చేసి ఏరియర్స్ చెల్లించాలని, లాభాల్లో వాటా, బోనస్ అర్హులైన ఉద్యోగులకు చెల్లించే రోజునే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు వాసాల శంకర్, ముదురుకోల కొమురయ్య, ఆసం కొమురయ్య, ఈర్ల సర్జన్, మద్ది ఎల్లయ్య, పుట్ట కొమ్మాలు, రాజమొగిలి, మొగిలిరెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరించండి

జన్నారం: త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలమడుగు వాసిగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీగా చేస్తున్న తనను ఆదరించాలని ట్రస్మా రాష్ట్ర ముఖ్యసలహాదారుడు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు కోరారు. పట్టభద్రుల ఓటు హక్కు నమోదులో భాగంగా మండలంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానికుడిగా ఇక్కడ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. 2021 నవంబర్ 6 లోపు పట్టభద్రులైన వారు తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలో ఉన్న తనను నిరుద్యోగులు, పట్టభద్రులు మేధావులు గెలిపించాలని కోరారు. సమావేశంలో కరీంనగర్ జిల్లా ట్రస్మా కోశాధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల భూములు కాపాడాలి

జన్నారం: కబ్జా కోరల్లో ఉన్న చెరువులు, ప్రభుత్వ భూములు కాపాడాలని కోరుతూ తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మాజీ ఎంపీటీసీ రియాజోద్దీన్ ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

జన్నారం: మండలంలోని బంగారుతండాలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశించారు. గ్రామంలోని గిరిజనులు, రైతులు ఇటీవల ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఆమె ఆదేశాలతోనే విద్యుత్ అధికారులు సిబ్బంది శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈ ఎండీ కైసర్, టెక్నికల్ ఏడీఈ తిరుపతి, లక్సెట్టిపేట ఏడీఈ ప్రభాకర్, ఏఈ లచ్చన్న, సబ్ ఇంజినీర్ అజయ్..బంగారుతండాకు వెళ్లి రైతులతో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఈ స్పందించి, వారం రోజుల్లో విద్యుత్ సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

పంచాయతీగా ఏర్పాటు చేయాలి

జన్నారం: మండలంలోని మొర్రిగూడ గ్రామం ఎస్సీ కాలనీని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందజేశారు. ప్రేంసాగర్, గంగారాం, కాంతరావు, భీము, ఇందూరు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సరుకులు అందజేత

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని అనాథ పిల్లలు, వృద్ధుల మానసిక వికలాంగుల ఆశ్రమానికి జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి లయన్స్ క్లబ్ సభ్యుడు వి.మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. మంచిర్యాల శాఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి బస్తీ పోశమ్మ చెరువు వద్ద నుంచి రాంనగర్ అండర్ బ్రిడ్జి వరకు ఉన్న మురుగునీటి కాలువను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు అన్వర్ ఖాన్, ముస్లిం మైనార్టీ నాయకుడు అమానుల్లాఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వేమనపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు సూపరింటెండెంట్ సయ్యద్ ఇఫ్తేకర్ ఆలీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పనుల నిర్వహణలో ఆర్థికభారం, మానసిక సమస్యలతో సతమతమవుతున్నామని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తాము ఆర్థికంగా, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించలేక పోతున్నామని కార్యదర్శులు తెలిపారు. శుక్రవారం హాజీపూర్ మండల ఎంపీపీ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు.

బీజేపీ నాయకుల దిష్టిబొమ్మ దహనం

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ జయశంకర్ సార్ కూడలి వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ నాయకుల దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కుల అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్అండ్‌పీసీ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ మద్దెల శంకర్ కుమార్తె పావని వరంగల్‌లో ఎంబీబీఎస్ ఐదో సంవత్సరం, సివిల్ డిపార్ట్‌మెంట్లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న పోలోజు రమేశ్ కుమారుడు సందీప్..మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. సింగరేణి సంస్థ విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందించే రూ.10 వేల మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను శుక్రవారం ఏరియా జీఎం ఆఫీస్ చాంబర్‌లో జీఎం దేవేందర్ ఉద్యోగులకు వేర్వేరుగా అందించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఓఎస్ రాయలింగు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రొట్టపల్లిలో సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట: మండలంలోని రొట్టపల్లిలో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి రోడ్లు లేక నీటి సమస్యతో గ్రామస్తులతో మాట్లాడారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వాలకు ఓట్లు అప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. బీజేపీ నాయకులు సతీశ్, విష్ణువర్ధన్, రవి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సంతకం ఫోర్జరీ కేసులో రిమాండ్

లక్సెట్టిపేట: సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమంగా భూమిని కబ్జా చేసిన కేసులో దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన హరినాయక్‌ను రిమాండు చేసినట్లు ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావుకు అల్లిపూర్ గ్రామ శివారులో ఏడెకరాల భూమిని వారసత్వంగా వచ్చిందని తెలిపారు. 1990లో నలుగురు కుమారులకు పంచి ఇచ్చాడని, వారు ఎవరికీ అమ్మలేదని తెలిపారు. 1998లో హరినాయక్ ఐదు రూపాయల స్టాంపు పేపర్‌పై గుర్తు తెలియని వ్యక్తితో వేలిముద్ర వేయించి కొనుగోలు చేసినట్లు నకిలీ పేపరు సృష్టించి భూమిలోకి ఎవరూ రాకుండా బెదిరిస్తున్నాడని మురళీధర్‌రావు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం చేసిన లేబర్ కోడ్‌లు, నేర చట్టాలు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని సివిక్ కార్యాలయం వద్ద వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ ఇందిరాపార్కు వద్ద చేపట్టే ధర్నాలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అసంఘటిత కార్మికులు పాల్గొనాలని కోరారు. సంఘం నాయకులు మేకల రామన్న, పోతుల కిష్టన్న, అప్పారావు, సమ్మయ్య, వెంకన్న, రాంబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తయిన నిరుద్యోగులకు రుణాలు


మోదీ ప్రసంగాన్ని వింటున్న నిరుద్యోగులు

బెల్లంపల్లి: ప్రధానమంత్రి విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకు రుణాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామని లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, యూత్ ట్రెనింగ్ సెంటర్ (వైటీసీ) ఏడీ కార్తీక్ అన్నారు. బెల్లంపల్లిలోని ఐటీడీఏ వైటీసీలో శిక్షణ పూర్తి చేసిన నిరుద్యోగులకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైటీసీలనుద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైటీసీలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 150 మంది శిక్షణ పొందారని తెలిపారు. వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేయించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైటీసీ ఇన్‌చార్జి స్వప్న, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ భీంరావు, అధికారులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ యూనిఫాంల పంపిణీ


విద్యార్థినులకు యూనిఫాంలు అందజేస్తున్న డీఈవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని సబ్బెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 155 మంది విద్యార్థులకు డీఈవో యాదయ్య శుక్రవారం స్పోర్ట్స్ యూనిఫాంలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వి.సుధారాణి సొంత డబ్బులు రూ.70 వేలతో అందించిన యూనిఫాంలను అందజేశారు. ఉపాధ్యాయులు రమేశ్, శారద, మంజుల, సత్యం, రాజశేఖర్, నాగప్రసాద్, ప్రసాద్‌రావు, కళ్యాణి, జుబేదా, లక్ష్మి, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

జన్నారం: మండలంలోని రేండ్లగూడ, కిష్టాపూర్, మొర్రిగూడ, ఇందన్‌పల్లి గ్రామాల్లో డీపీవో వెంకటేశ్వర్ రావు శుక్రవారం సాయంత్రం పారిశుధ్య పనులను పరిశీలించారు. రేండ్లగూడలో డంపింగ్‌యార్డును పరిశీలించి వీటి నిర్వహణ గురించి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులున్నారు.

డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీవో →



గంజాయి కేసులో పట్టుబడినవారిపై నిఘా

మందమర్రిరూరల్: గంజాయి కేసులో పట్టుబడిన పాత నేరస్తులు, నిందితులపై నిఘా పెట్టినట్లు మందమర్రి ఎస్సై రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ల పరిధిలోని వారి ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది ఉన్నారు.

లాభాల వాటా ఇప్పించేలా కృషి

శ్రీరాంపూర్: వచ్చేనెల వేతనాలతోపాటు లాభాల వాటా ఇప్పించడానికి కృషి చేస్తున్నామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. నస్పూర్‌కాలనీలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. సింగరేణి గత ఆర్థికసంవత్సరం సాధించిన లాభాలను ఈనెలాఖరులోగా ప్రకటిస్తారని తెలిపారు. ఈ మేరకు యూనియన్ సెక్రటరీ జనరల్ ప్రసాద్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. గత టీబీజీకేఎస్ సంఘం కన్నా తామే ముందు వీటిని ఇప్పిస్తున్నామని అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని ఆరోపిస్తున్న ఏఐటీయూసీ నేతలు వారి పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సచివాలయంలో ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చే సింగరేణి కార్యక్రమానికి ఎందుకు హాజరయ్యారో చెప్పాలని డిమాండ్ చేశారు. యూనియన్ జాతీయ సమితి సభ్యుడు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని, గౌరవ వేతనం పెంచాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 18 మండలాలకు చెందిన రేషన్ డీలర్ల జిల్లా కేంద్రంలో సమావేశం అయ్యారు. రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ ఈ నెల 24న పటాన్‌చెరులో రేషన్ డీలర్ల భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు మంగ సుమతి, కృష్ణ, మహేందర్ పాల్గొన్నారు.

మంచి అలవాట్లను అలవర్చుకోవాలి

బెల్లంపల్లి: విద్యార్థులు చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టెలిమానస స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అంజయ్య, వైద్యులు సునీల్ కుమార్, జగన్మోహన్, అధ్యాపకులు కృష్ణవేణి, చంద్రయ్య, కరుణాకర్, గురుపాదం, రాజేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సోమయ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం


బెల్లంపల్లి: ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

బెల్లంపల్లి: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 1వ వారు కన్నాల పార్కులో శ్రమదానం, నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీలో సిబ్బంది చెత్తాచెదారాన్ని ఊడ్చివేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీగా తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. అంతకుముందు కన్నాల బస్తీలో ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సిలర్ సూరం సంగీత, పర్యావరణ ఇంజినీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య, స్థానికులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. బావుల వద్ద, ఇంటి పరిసరాల్లో కుండలు, టైర్లు, కూలర్లు, ఇతర వాటిల్లో నిల్వ ఉన్న నీటిని కింద పారబోయించారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: సంపూర్ణ స్వచ్ఛత, స్వచ్ఛత లక్షిత్ ఎకాయ్ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్‌నగర్ కాలనీలోని చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మంచిర్యాల మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్..ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి, మున్సిపల్ చెత్త వాహనాలకు ఇవ్వాలని అవగాహన కల్పించారు. అనంతరం రాంనగర్‌లోని మున్సిపల్ పార్కులో చెత్తను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

బెల్లంపల్లి: చిన్నారులు ఎదిగే వయస్సులో పోషకాహారం అందించాలని జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి అన్నారు. పట్టణంలోని హన్మాన్‌బస్తీలోని ప్రైవేట్ పాఠశాలలో సామ్, మామ్ చిన్నారులకు శుక్రవారం గ్రోత్ మానిటరింగ్ స్క్రీనింగ్ నిర్వహించారు. అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యురాలు డి.సౌజన్య పిల్లలను పరీక్షించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఇద్దరు చిన్నారులను ఎన్ఆర్‌సీకి రెఫర్ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పలత, ప్రసన్న, విష్ణుప్రియ, ప్రభావతి, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త రజిత, డీపీఏ శ్యామల, బ్లాక్ కోఆర్డినేటర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం రుబియా పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కిశోర బాలికలకు పోషణమాసం సందర్భంగా ఆరోగ్య రక్షణపై శుక్రవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల సీడీపీవో చందన, కేజీబీవీ ఎస్‌వో స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, రమ పాల్గొన్నారు.